# లక్ష్మిరోజు

"కారొస్తోంది. తప్పుకోవయ్యా" అరిచాడు దర్వాను.

రోడ్డుకు అడ్డం పడి వస్తున్న రంగనాయకులు వడివడిగా అడుగులు వేస్తూ పక్కకు చూశాడు. నల్లటి ఓడలాటి కారు చిక్కటి ఎండను చీల్చుకుంటూ వేగంగా వస్తోంది. పంచ ఎత్తిపట్టుకుని ఫుట్‌పాత్ మీదకు చేరుకున్నాడో లేదో కారు పక్కగా శబ్దం కాకుండా జారుకుంది. కారు వెనకసీట్లో కూర్చుని ఉన్న వీరభద్రాన్ని చూస్తూ 'వీడు ఎంత మారిపోయాడు!' అనుకున్నాడు రంగనాయకులు.

నల్లటికారు మెయిన్‌గేట్ దాటి లోపలకు వెళ్ళి పోయాక కాకీ దుస్తుల్లో ఉన్న దర్వాను గేటు మూసి రంగనాయకుల వంక చూసి, "కొద్దిగా ఉంటే కారు కింద పడేవాడివి" అని కర్ర చంకలో పెట్టుకుని జేబులోంచి బీడీతీసి వెలిగించాడు.

నుదుటికి పట్టిన చెమటను కండవాతో తుడుచుకుని దర్వాను దగ్గరకు వచ్చి నిలబడ్డాడు రంగనాయకులు. స్టేషన్ నుండి నాలుగుమైళ్లు నడిచి రావటం వలన కాళ్లు నొప్పులుగా ఉన్నాయి. నీరసంగా ఉంది.

"ఇప్పుడు కార్లో వచ్చింది ఎవరో తెలుసా?" అడిగి రంగనాయకులు జవాబు చెప్పేలోపల "ఈయనే మా కంపెనీ ప్రొప్రయిటరు" అన్నాడు దర్వాను.

తెలుసన్నట్టు రంగనాయకులు తలూపాడు.

మెయిన్‌గేట్‌కు అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగు అరఫర్లాంగు దూరంలో ఉంది. కారు పోర్టికోలో ఆగీ ఆగగానే తెల్లటి యూనిఫాంలలో ఉన్న నల్లటి జవాను మిలటరీ ఫక్కీలో సలాం చేసి తలుపు తెరిచి పట్టుకున్నాడు. వీరభద్రం బ్రీఫ్‌కేస్ తీసుకుని కారు దిగాడు. పొరపాటునయినా ఆ బ్రీఫ్‌కేస్ ఎవరికీ ఇవ్వడు. తన దగ్గిరే ఉంచుకుంటాడు. అంత జాగ్రత్తపరుడు కాబట్టే అంత పేరున్న కంపెనీని తన సొంతం చేసుకోగలిగాడు. అతను ఎవరినీ నమ్మడు. చివరకు భార్యను కూడా. అతని భార్య పేరు అరుంధతి. ఒక కూతురు ఉంది. పేరు పద్మజ. పద్మజకు పన్నెండు సంవత్సరాలుంటాయి. ఏడో తరగతి చదువుతోంది. ఆ పిల్లకు చిన్నప్పుడే పోలియో వచ్చి కాళ్ళు పడిపోయాయి. పద్మజ

తర్వాత అరుంధతికి మళ్ళీ పిల్లలు కలగలేదు. అరుంధతి అతని రెండోభార్య. మొదటి భార్య పేరులక్ష్మి. లక్ష్మి చనిపోక మునుపే అరుంధతిని పెళ్ళి చేసుకున్నాడు.

టై నాట్ వదులు చేసుకుంటూ మెట్లు చకచక ఎక్కి హుందాగా బిల్డింగ్ లోపలకు నడుస్తున్న వీరభద్రాన్ని చూస్తున్న రంగనాయకుల్ని అడిగాడు దర్వాను, "మీదు ఊరు?"

"విజయవాడ."

"మా సారుతో మీకేమయినా పనుందా?"

తలూపాడు.

"ఏం పని?"

ఏమని చెప్పాలో రంగనాయకులికి అర్థం కాలేదు కొద్దిసేపు మౌనంగా ఉండి, నాలుకతో పెదాలు తడుముకుని "ఆయనతో రెండు ముక్కలు మాట్లాడాలి" అన్నాడు చిన్నగా.

"ఇక్కడున్నంత సేపూ బిజీగా ఉంటారు. ఇంటికెళ్లి ఎంతసేపయినా మాట్లాడొచ్చు."

"ఆయనింటికి వెళ్లటం నాకు ఇష్టంలేదు. నీకు వీలయితే ఆయనతో మాట్లాడటానికి దారి చూపించు. ఈ సహాయం చేయగలిగితే చాలా సంతోషిస్తాను. లేదూ నేను వచ్చిన దారినే వెళ్లిపోతాను" అన్నాడు రంగనాయకులు.

పన్నెండింటికి పది నిముషాలుందనగా వర్క్స్ మేనేజరు శ్రీనివాసస్వామి రెడ్డప్ప గదిలోకి వచ్చి కుర్చీ లాక్కుని ఎదురుగా కూర్చుని, "సార్‌తో మాట్లాడటానికి వచ్చాను" అన్నాడు.

రెడ్డప్ప వీరభద్రం పర్సనల్ సెక్రటరీ. అతని గది వీరభద్రం ఛేంబరుకు ఆనుకుని ఉంది. రెడ్డప్ప, "ఇప్పుడా?" అడిగాడు.

"ఆయన మూడ్ ఎలా ఉంది?"

"బావున్నట్టులేదు."

"ఆయన్ని కలవాలి."

"మిమ్మల్ని రమ్మన్నారా?"

"అదేం కాదు. చిన్న సమస్య వచ్చి పడింది."

"వర్క్‌స్పాట్ లోనా?"

"కాదు. నాస్వవిషయం. ఆయన సలహా కావాలి. రెండు నిమిషాల కంటే ఎక్కువ సమయం తీసుకోను. నాకో సహాయం చేసి పెట్టండి. లోపలికి వెళ్లినేను వచ్చినట్లు

చెప్పండి. కూల్‌గా ఉండి రమ్మంటే వెళ్తాను. లేదంటే తిరిగి వెళ్ళిపోతాను” అన్నాడు శ్రీనివాసస్వామి.

“రెండు నిమిషాలు కూర్చోండి. ఆయన సంతకాలు తీసుకోవల్సిన అర్జంటు పేపర్లు ఉన్నాయి”. రెడ్డప్ప లేచాడు.

తలుపుకున్న చిన్న అద్దంలోంచి వీరభద్రం గదిలోకి చూశాడు రెడ్డప్ప. వీరభద్రం కుర్చీలో చేరగిలబడి మెల్లగా తిరుగుతున్న సీలింగ్ ఫేన్ వంక చూస్తూ ఆలోచనల్లో పడి ఉన్నాడు. అతని చేతిలో సిగరెట్ వెలుగుతోంది. ఇంట్లో ఏదయినా గొడవ అయితేనే కాని అతని మూడ్ ఆఫ్ కాదు. అతని ప్రవర్తన, పద్ధతులు అరుంధతికి బొత్తిగా నచ్చవు. అతను కూడదన్న పనులు అరుంధతి కావాలనే చేస్తుంటుంది. అతనంటే ఆమె ఏమాత్రం భయపడదు. అయితే అరుంధతికి వీరభద్రం భయపడుతుంటాడు. అందుచేత అతను రోజులో ఎక్కువ భాగం కంపెనీలో గడుపుతుంటాడు. కంపెనీ తప్పితే క్లబ్బులో ఉంటాడు.

వీరభద్రం ముందుకు వంగి చివరంటా కాలిన సిగరెట్‌ను యాష్‌ట్రేలో నొక్కుతుంటే రెడ్డప్ప తలుపు తట్టి ఛాంబర్‌లోకి వచ్చాడు.

“రెడ్డప్పా, నీ దగ్గిర తలనొప్పి మాత్రలు ఉన్నాయా?”

“నా దగ్గిర లేవు సార్. అయిదు నిమిషాల్లో తెప్పించి ఇస్తాను” అని తను తెచ్చిన పేడ్ బల్లమీదున్న ఇన్‌ట్రేలో పెట్టి “శ్రీనివాసస్వామి గారు మీతో మాట్లాడాలని వచ్చారు” అన్నాడు.

“ఇప్పుడు కాదు. నేనిప్పుడు ఎవరినీ చూడను. మాట్లాడను. అయి వాంట్ కంప్లీట్ రెస్ట్ ఫర్ సంటయిమ్. నన్నే మాత్రం డిస్టర్బ్ చేయకు. ఆయన్ని సాయంత్రం వచ్చి కనిపించమని చెప్పు.... అదేమిటి?”

“విజిటింగ్ కార్డ్ సార్.”

“ఎవరిది?”

“రంగనాయకులట” రెడ్డప్ప కార్డు అందించాడు. కార్డు మాసిపోయి మూలలు మడతలు పడి ఉన్నాయి. మధ్యలో పి.రంగనాయకులు, బి.ఇ. అని ఉంది. పేరు కిందిలైన్లో ఏదో ఉందికాని స్పష్టంగా కనిపించటం లేదు. ఆకార్డును చూడగానే రంగనాయకుల మీద అపరిమితమయిన జాలివేసింది. ఇరవయి అయిదు సంవత్సరాల కిందట ఆయన్ని తెలియని వాళ్లంటూలేరు. ఆయన్ని మించిన సివిల్ కాంట్రాక్ట్ ఉండేవాడు కాదు. కట్టడాలు కూడా చాలా బావుండేవి. తన కంపెనీ కట్టటం మొదలెట్టింది ఆయనే. అయితే పూర్తి చేసింది మటుకు అరుంధతి అన్నయ్య. రంగనాయకులంటే వీరభద్రానికి

అమితమయిన భయం. ఆయన ఎవరినీ, లెక్కచేసేవాడు కాదు. చితికిపోయిన తర్వాత ఆయన నమ్మినవాళ్ళందరూ తలోదారి చూసుకున్నారు. తను ముందే జాగ్రత్త పడ్డాడు. ఆయన చేయూత  లేనిదే తనింతటివాడు అయి ఉండేవాడు కాదు.

విజిటింగ్ కార్డు బల్లమీద పెట్టి, "కొద్దిసేపాగి పాట్‌లో కాఫీ పంపించు. రెండు కప్పులు కూడా పంపించు. తలనొప్పి మాత్రల సంగతి మర్చిపోకు" అన్నాడు.

రెడ్డప్ప వెళ్ళిపోయిన  అయిదు నిమిషాల వరకు విజిటింగ్‌కార్డు వైపు చూస్తుండిపోయాడు వీరభద్రం. అయిదారు  సంవత్సరాల తర్వాత ఆయన తనను చూడటానికి  వచ్చాడంటే సంతోషం కన్నా భయంగా ఉంది. తను ఆయనకు చాలా బాకీ ఉన్నాడు. ఆయనకు ఇవ్వవలసిన డబ్బు గురించి అడగటానికి  వచ్చి ఉంటాడు. ఎంత ఇవ్వాలో ఎక్కడా రాసుకోలేదు. ఆయన రాసుకున్నాడేమో తెలియదు. కిందటిసారి కలుసుకున్నప్పుడు డబ్బులు సంగతి ప్రస్తావించినప్పుడు త్వరలో ఇచ్చేస్తానన్నాడు కాని ఇవ్వలేదు. ఇవేళ ఎటూ వచ్చాడు కాబట్టి ఎంతో కొంత ఇచ్చేస్తే పోతుంది. తనకు ఎవరి ఉసురు ఇహ తగలకూడదు. ఊచకాళ్ల పద్మజను చూసినప్పుడల్లా తను లక్ష్మికి చేసిన అన్యాయం గుర్తువచ్చి  మనసు బాధతో కలుక్కుమంటుంది.

పద్మజ గుర్తు రాగానే బల్లసొరుగు లోంచి చెక్‌బుక్ తీసిపెన్ను అందుకున్నాడు. కొద్దిసేపు  చెక్‌వైపు చూసి, 'ఆయన్ని తన గదిలోకి పిలిపించి ఎంత కావాలో అడిగి తెలుసుకున్నాక చెక్ నింపొచ్చులే' అనుకుని పెన్ను మూతపెట్టి జేబులో పెట్టుకుని, చెక్‌బుక్ సొరుగులో పెట్టి  సొరుగు మూసేస్తుంటే  తన పెళ్ళిరోజున ఆయన అన్న మాటలు గుర్తువచ్చాయి. "ఇంటికి  పెద్ద పిల్ల  లక్ష్మి అంటారు. నా కూతురు నిజంగా లక్ష్మీ దేవే. నా కూతురు పుట్టాకే నాకు అన్నివిధాలా కలిసి వచ్చింది. దీన్నిప్పుడు నీ చేతుల్లో పెడుతున్నాను. నా అదృష్టం నీకు ధారాదత్తం చేస్తున్నాను." ఈ మాటలంటున్నప్పుడు  ఆయన కంఠస్వరం  వణకటం తనకిప్పటికీ గుర్తుంది.

లక్ష్మిని చేసుకున్నాక కలిసి వచ్చిన మాట అబద్ధం కాకపోయినా రంగనాయకులకు కలిసి వచ్చినదంతా హరించుకుపోయింది. పద్మ పుట్టిన తర్వాత  తను పట్టినదంతా బంగారమే అయింది. కుర్చీలోంచి లేద్దామని అనుకునే లోపల రెడ్డప్ప లోపలికి  వచ్చి తలుపు తెరిచి పట్టుకున్నాడు. అతని వెనకే ఆర్డర్లీ ట్రే పట్టుకుని  గదిలోకి వచ్చి కిటికీ పక్కనే ఉన్న బల్ల మీద ట్రే పెట్టి వెళ్ళిపోయాడు. రెడ్డప్ప తలనొప్పి మాత్రలను బల్లమీద పెడుతుంటే, "ఇందాక నాకోసం ఎవరో వచ్చారన్నావు కదా?" అడిగాడు వీరభద్రం.

"శ్రీనివాసస్వామి..." అంటుంటే రెడ్డప్ప మాటలకు అడ్డు తగిలి, తల అడ్డంగా ఆడిస్తూ బల్లమీదున్న విజిటింగ్ కార్డు ఎత్తి పట్టుకుని, "ఈయన. ఈ విజిటింగ్ కార్డాయన ఎక్కడ ఉన్నాడయ్యా?" అడిగాడు వీరభద్రం విసుగ్గా.

"ఇప్పుడే కనుక్కుని చెప్తాను. ఉంటే మీ దగ్గిరకు పంపించమంటారా?"

"ఆ.. వెంటనే."

రెడ్డప్ప బయటకు వెళ్ళాక వీరభద్రం మాత్రలు చేతిలోకి తీసుకున్నాడు కాని వేసుకోలేదు. అతని ఆలోచనలన్నీ రంగనాయకుల మీదున్నాయి. రెడ్డప్పతిరిగొచ్చి ఏమని చెబుతాడో తానూహించగలడు.

వారం తర్వాత వీరభద్రానికి ఒక పోస్టుకార్డు వచ్చింది. అందులో ఇలా ఉంది.

"బాబూ! గడచిన మంగళవారం ఉదయం మూడు గంటల పదినిమిషాలకు నా భార్య ప్రసూనాంబ విజయవాడ జరనల్ ఆస్పత్రిలో చనిపోయింది. తను చనిపోయేముందు నిన్నొకసారి చూడాలని మరీ మరీ కోరితే సోమవారం నాడు నిన్ను కలుసుకుని ఆ సంగతి చెప్పి నిన్ను నాకూడా తీసుకెళ్దామని ఎంతో ఆశతో మీ కంపెనీకి వస్తే మీ వాళ్ళు నిన్ను చూడటానికి వీలు కానీయలేదు. నా భార్య చివరి కోరిక తీర్చలేకపోయాననే అనే బాధ మటుకు మిగిలిపోయింది– రంగనాయకులు."

◆ విజయ, మాసపత్రిక నవంబరు 1976